www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 4 అక్టోబర్ 2025
5
ఏలూరు



అత్యాచారం కేసులో పదేళ్లు జైలుశిక్ష

ప్రజాశక్తి - టి.నరసాపురం


మూగ, చెవిటి బాధితురాలైన వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కుమ్మరి రమేష్ (35)కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎం.జయబాబు శుక్రవారం విలేకరులకు వివరించారు. మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన వివాహమై మూగ, చెవుడుతో బాధపడుతున్న వివాహితపై 2018 మార్చి 21న కామవరపుకోటకు చెందిన కుమ్మరి రమేష్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వి.రాంబాబు కేసు నమోదు చేయగా అప్పటి సిఐ దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని రమేష్ వాదనలు వినిపించగా నేరం రుజువైంది. దీంతో ఏలూరు జిల్లా 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్‌విపిఎస్.మురళీకృష్ణ ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేవీ ఆయుధ డిపోకు..
సాగు భూములే ఎందుకు..!

- పామాయిల్, వేరుశెనగ వంటి పంటలు పండే భూములపై కన్ను
- బ్రిరింకలపాడు, ఇతర అటవీ భూముల్లో పెట్టుకునే అవకాశమున్నా బేఖాతరు
- వంకావారిగూడెం గ్రామం ఖాళీ చేయించడమే లక్ష్యంగా ముందుకు
- మండల పరిషత్ తీర్మానంతో ముందుకెళ్లేందుకు కుయుక్తులు
- రీసర్వే గ్రామ సదస్సును సైతం వ్యతిరేకించిన గ్రామస్తులు
- వచ్చే ఆదివారం పీసా కమిటీ ఏర్పాటు చేసి తేలుస్తామంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై అధికారులు, ప్రజాప్రతినిధుల వ్యవహార శైలి రోజురోజుకీ వివాదాస్పదంగా మారుతోంది. ప్రజాభిప్రాయానికి ఏమాత్రం విలువ లేకుండా ముందుకు సాగుతున్న తీరు ఆందోళనకు తావిస్తోంది. జీలుగుమిల్లి మండలంలో ఏర్పాటు చేయాలని చూస్తున్న నేవీ ఆయుధ డిపోకు గిరిజనుల సాగుభూములే ఎందుకని, గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆనుకుని ఉన్న బ్రిరింకలపాడు అటవీ భూముల్లోగానీ, ఇతర ప్రాంతాల్లోగానీ నిర్మించే అవకాశమున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా అక్కడే ఆయుధ డిపో పెడతామంటూ ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్న తీరుపై అక్కడి ప్రజలు మండిపడుతున్నారు.


రీసర్వే గ్రామ సదస్సులో మాట్లాడుతున్న అధికారి

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం గ్రామాల్లో మొత్తం 1,166 ఎకరాల భూములను సేకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. నేవీ ఆయుధ డిపోకు సేకరించాలని చూస్తున్న భూములన్నీ పామాయిల్, వేరుశెనగ, పొగాకు వంటి పంటలు పండే నాణ్యమైన భూములు. ఆ భూముల్లో పని చేసుకునే ఆయా గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. దీంతో తమ భూములు ఇచ్చేది లేదంటూ ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటి వరకూ మూడుసార్లు వ్యతిరేకంగా గ్రామసభల్లో తీర్మానం సైతం చేశారు. అంతేకాకుండా పెద్దఎత్తున ఆందోళనలు సైతం సాగిస్తున్నారు. అయినప్పటికీ బలవంతంగా నేవీ ఆయుధ డిపోను వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోనే ఏర్పాటు చేయాలని అధికారులు, ఎంపీ, ఎంఎల్ఎ మొండిగా ముందుకు సాగుతున్నారు.

వేరేచోట పెట్టుకోండి..

వ్యవసాయం చేసుకునే సాగు భూముల్లో కాకుండా అదే మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆనుకుని ఉన్న బ్రిరింకలపాడు అటవీ భూముల్లోగాని, దర్భగూడెం అటవీ భూముల్లోగాని, వేరే ప్రాంతంలోగాని పెట్టుకోవాలని అక్కడి ప్రజలు సూచిస్తున్నారు. తాము వద్దంటే వినకుండా బలవంతంగా ఇక్కడే పెట్టాలని చూడటం అత్యంత దుర్మార్గమని మండిపడుతున్నారు. నేవీ ఆయుధ డిపో కేంద్రం పరిధిలోని రక్షణశాఖకు సంబంధించింది. అటవీభూముల్లో ఏర్పాటు చేసే ఆలోచన చేయకుండా గిరిజనులకు ఆధారమైన సాగు భూముల్లో ఎందుకు నిర్మించాలని చూస్తున్నారో అర్థం కావడం లేదు. ఇతర ప్రాంతాల్లో సాగు చేయని భూముల్లోనైనా నిర్మించుకునే అవకాశం ఉంది. జిల్లా అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి గిరిజనులను ఇబ్బంది పెడుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీ, ఎంఎల్ఎ మొండిగా ముందుకు సాగడం వెనుక వేరే ఆలోచనలు ఉన్నాయనే చర్చ సైతం సాగుతోంది.

అడ్డదారుల్లో ముందుకెళ్లే ఆలోచనలు..

నేవీ ఆయుధ డిపోను ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో రాజకీయ నాయకులు అడ్డదారులు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభ తీర్మానం లేకుండా ఏ పనీ చేయడానికి వీలుండదు. ఆయుధ డిపో ఏర్పాటును గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామసభ తీర్మానం అనుకూలంగా జరిగే అవకాశం లేదని తేలిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా మండల పరిషత్‌లో ఎంపిటిసిలతో అనుకూలంగా తీర్మానం చేసి ముందుకు సాగాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. నేవీ ఆయుధడిపోకు అనుకూలంగా సంతకాలు చేయాలని రాజకీయ నాయకులు ఎంపిటిసిలకు ఫోన్లు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ముందుకు సాగితే తీవ్ర ప్రతిఘటన తప్పదని వంకావారిగూడెం ప్రజలు హెచ్చరిస్తున్నారు. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో గురువారం రీసర్వే పేరుతో ఏర్పాటు చేసిన గ్రామ సదస్సును సైతం అక్కడి ప్రజలు వ్యతిరేకించారు. రీసర్వే సదస్సు అధికారులు, ప్రజాప్రతినిధుల కుట్రలో భాగంగా అంతా చెబుతున్నారు. ఈ నెల ఐదో తేదీన పీసా కమిటీ ఏర్పాటు చేసి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం మొండిగా ముందుకు సాగితే దేనికైనా సిద్ధమని గిరిజనులు హెచ్చరిస్తున్నారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ రాక

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 4న ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ఏలూరు కొత్తదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమంలో ఎంఎల్ఎలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొంటారు.

సూపర్ జిఎస్‌టిపై అవగాహనా కార్యక్రమాలు

నేడు ప్రతి నియోజకవర్గంలో 'ఆటో డ్రైవర్ సేవలో'

6న స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమం

అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్



ప్రజాశక్తి - ఏలూరు

సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఇ, వర్తకులు, వినియోగదారులతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రెండో వారం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నిత్యావసర సరుకులపై జిఎస్‌టి తగ్గింపుతో ఏ మేరకు లబ్ధి కలుగుతుందో ప్రతి కుటుంబానికి తెలియజేయాలన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక రంగాలపై జిఎస్‌టి సంస్కరణలపై ఎంఎస్ఎంఇ, వర్తకులు, వినియోగదారులతో మండల, నియోజకవర్గ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రత్యేక షాపింగ్ మేళాలు నిర్వహించేలా ఎంపిడిఒలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 6న 'స్వచ్ఛాంధ్ర అవార్డు'ల కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు, జిల్లాస్థాయిలో 51 అవార్డులు లభించాయన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీహరి, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి

ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

పది రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ.. నిలకడగా ఉంటూ ముంపు మండలాల ప్రజలకు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన గోదావరి వరద ఎట్టకేలకు శాంతించింది. గోదావరి తగ్గుముఖం పట్టినా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుకాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో వాగు అవతల గల 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఆయా గ్రామాలకు రాకపోకలు కొనసాగే అవకాశం ఉంది.

పోలవరం నుండి 8,00,702 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: పోలవరంలో గోదావరి వరద స్వల్పంగా తగ్గింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36.90 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 8,00,702 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.720 మీటర్లు, దిగువన 23 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 11.24 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

37 మంది ఎల్‌పిలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2018 డిఎస్‌సిలో లాంగ్వేజ్ పండిట్లుగా ఎంపికై ఎస్‌జిటి కేడర్లో పని చేస్తున్న 37 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. 2019లో రాష్ట్రంలో ఎస్‌జిటి కేడర్లో పని చేస్తున్న లాంగ్వేజ్ పండిట్లందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించినప్పటికీ ప్రొబేషన్ పూర్తి కాలేదనే కారణంతో 2018 బ్యాచ్‌కు ప్రమోషన్లు ఇవ్వలేదు. రెండు సంవత్సరాల తర్వాత 2021లో ప్రొబేషన్ పూర్తిచేసుకున్నప్పటికీ వీరికి ప్రమోషన్ కల్పించలేదు. దీంతో వారంతా తమకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ కోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో సుమారు ఐదు నెలల క్రితం వీరికి ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం జాప్యం చేసింది. 2025 మెగా డిఎస్‌సిలో లాంగ్వేజ్ పండిట్లు అందర్నీ స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లోనే ఎంపిక చేశారు. 2025 డిఎస్‌సి అభ్యర్థులు శుక్రవారం నుంచి శిక్షణకు వెళ్లి, 10న విధుల్లో చేరబోతున్న నేపథ్యంలో వారికంటే ఆరు సంవత్సరాలు సీనియర్లయిన 2018 డిఎస్‌సి లాంగ్వేజీ పండిట్లు ఇంకా సెకండరీ గ్రేడ్ క్యాడర్లో ఉండటంతో విద్యాశాఖ అధికారులు గురువారం మధ్యాహ్నం వారందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని హడావిడిగా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 16 మంది తెలుగు, 13 మంది హిందీ, ఏడుగురు సంస్కృతం, ఒక ఉర్దూ లాంగ్వేజ్ పండిట్లను సాయంత్రం ఐదు గంటలకు ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి రావాలని విద్యాశాఖాధికారులు వ్యక్తిగతంగా ప్రతిఒక్కరికీ ఫోన్లు చేసి పిలిచారు. అయితే వేలేరుపాడు, పోలవరం, బుట్టాయగూడెం, ఇటు పాలకొల్లు, నరసాపురం వంటి దూర ప్రాంతాల నుంచి అభ్యర్థులు రాత్రి 8 గంటల సమయానికి డిఇఒ కార్యాలయానికి చేరుకున్నారు. దసరా పండుగ అయినప్పటికీ విద్యాశాఖ సిబ్బంది కూడా రాత్రి 11 గంటల వరకు పనిచేసి ఎట్టకేలకు ప్రమోషన్ల ఉత్తర్వులు ఉపాధ్యాయులకు అందజేశారు. ఉత్తర్వులు అందేటప్పటికి రాత్రి 11 కావడంతో దూర ప్రాంతం నుంచి వచ్చిన వారు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడ్డారు.


ప్రమోషన్ ఉత్తర్వులతో లాంగ్వేజ్ పండిట్లు

16 మంది తలసేమియా బాధితులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో శుక్రవారం 16 మంది తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వారానికి రెండు రోజులు రక్తమార్పిడి చికిత్స నిర్వహిస్తున్నామని, అవసరమైన రక్త పరీక్షలతోపాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు 35 మందికి మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేసిన దుగ్గిరాల ప్రవీణ్ కుమార్, వాణి దంపతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, డాక్టర్ ఆల్బర్ట్, పిఎఆర్ఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, డాక్టర్ ఇ.రేణుశ్రీ, హెడ్ నర్స్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న ప్రసాద్, ప్రముఖులు

రోగుల పట్ల మర్యాదతో వ్యవహరించాలి

ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశంలో డిఎంహెచ్ఒ పిజె.అమృతం


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ పిజె.అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


ల్యాబ్ టెక్నీషియన్లు రోగుల పట్ల ప్రేమానురాగాలు, మర్యాదతో వ్యవహరించాలని, ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకమని డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం సూచించారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ల్యాబ్ టెక్నీషియన్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ పరీక్షల ద్వారా రోగి ఏ వ్యాధితో బాధపడుతున్నాడో గుర్తించ గలమన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు అంకితభావంతో పని చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావా లన్నారు. ఎక్కువ రక్త, మూత్ర పరీక్షలు చేసి జిల్లా గ్రేడింగ్‌ను పెంచాలని సూచించారు. రక్త పరీక్ష గదులు పరిశుభ్రంగా ఉండాలని, రక్త పరీక్ష చేసే పరికరాలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు రక్త పరీక్షల్లో అశ్రద్ధ చూపించకుండా కచ్చితమైన పరీక్షలు నిర్వహించి, కచ్చితమైన రిజల్ట్ ఇవ్వాలని, అప్పుడే రోగి భయపడకుండా ధైర్యంగా ఉండగలుగుతాడని అన్నారు. మలేరియా, డెంగి నిర్మూలనలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర చాలా కీలకమని, డెంగీ, మలేరియా నిర్ధారణా పరీక్షలు ఎక్కువగా చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, రామకృష్ణ, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ కరుణకుమారి, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

నిషేధిత భూముల జాబితా నుంచి
ఇళ్ల స్థలాలు తొలగించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని చిన నిండ్రకొలను (పత్తేపురం)లో పేదల నివేశన స్థలాలను ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిడమర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. 1956 నుంచి కొనుగోలు చేసే రిజిస్ట్రేషన్ జరిగిన నివాస గృహల భూములను ప్రభుత్వం 2015 నుంచి నిషేధిత భూముల జాబితాలో చేర్చిందని, గతేడాది 2024లో సిపిఎం ఆధ్వర్యంలో పేద ప్రజలు పోరాటం ద్వారాగా కొన్ని నివాస గృహలు, భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారని, మరి కొంతమంది నివాస భూములు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే నివాస గృహ భూముల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గణపవరం సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరగా రెవెన్యూ అడంగల్‌లో ఉందని, సంబంధిత రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ను కలవాలని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిపి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నడింపల్లి పాండురంగరాజు, బి.రాజేశ్వరి, బొక్క లక్ష్మి, కె.సత్యవతి, నంబూరి హరికృష్ణ, చిలుకూరి వెంకట నరసమ్మ, వేగేశ్న సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నేతలు

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

తీరిన ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పంచాయతీ పైపులైన్ లీకేజీతో కొన్ని నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఈ నెల రెండో తేదీ గురువారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ముదినేపల్లి-బంటుమిల్లి ఆర్‌అండ్‌బి రహదారిలో మండలంలోని వడాలి సెంటర్‌లో బస్టాప్ వద్ద ఉంది. కొన్ని నెలలుగా పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా ప్రధాన రహదారిలో పారుతుంది. చాలా కాలంగా ఈ పరిస్థితి ఉండడంతో ఆ ప్రాంతమంతా పాకుడు కట్టి పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. లీకేజీ నీరంతా రోడ్డు వెంబడి పారుతూ బస్టాప్, దుకాణాల ముందు నిల్వ ఉంటుంది. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దుకాణాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచి దుర్గాశ్రీ, పంచాయతీ కార్యదర్శి వై.శ్యామ్‌సుందర్ పైపులైన్ లీకై నీరు వృథాగా పోతున్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టారు. దీంతో గత కొన్ని నెలలుగా వృథాగా పోతున్న తాగునీటికి, ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సమస్య పరిష్కారం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

5న జిల్లా స్థాయి ఎంపికలు

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏడో రాష్ట్ర రెవెన్యూ క్రీడల సందర్భంగా ఈ నెల ఐదో తేదీ ఆదివారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తేదీ ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒక కిలోమీటర్ వాకింగ్ రేస్, క్యారమ్స్ డబుల్స్, టెన్నికాయిట్, వంద మీటర్ల డాష్, షాట్ పుట్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, వాలీబాల్ , క్రికెట్, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, మ్యూజికల్ చైర్స్ అంశాల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర క్రీడలకు ఎంపిక చేస్తారని, రాష్ట్ర క్రీడలకు ఎంపికైన వారికి ప్రభుత్వం ఐదు రోజులు ప్రత్యేక సెలవులు ప్రకటిస్తుందని పేర్కొన్నారు. ఉత్సాహవంతులైన రెవెన్యూ ఉద్యోగులందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

వేగంగా పట్టణాభివృద్ధి

చింతలపూడిలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కూటమి ప్రభుత్వంతోనే పట్టణ అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని నగర పంచాయతీలో మూడు కిలోమీటర్లు సెంట్రల్ లైటింగ్ ప్రారంభించారు. దీనిని ప్రజలకు అంకితం చేశారు. అదే విధంగా పబ్లిక్, మరుగుదొడ్లు, మినీ బస్టాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల ప్రజల కలను నెరవేర్చిన ఘనత ఉమ్మడి కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. మూడు కిలోమీటర్ల పొడవుతో దాతల సహకారంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. సెంట్రల్ లైటింగ్‌తో పట్టణమంతా వెలుగులు వచ్చాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అభివృద్ధి వేగవంతమైందన్నారు. పారిశుధ్య నిర్వహణలో చింతలపూడి పట్టణం అగ్రగామిగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభివృద్ధిలో చింతలపూడిని ప్రథమ స్థానంలో నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్, నాయకులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

చిట్టీల పేరుతో మోసగించారని ఫిర్యాదు

రూ.రెండు కోట్ల మేర దగా చేశాడని ఆవేదన

న్యాయం చేయాలని ఎన్‌టిఆర్ కాలనీవాసుల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి బుడగ జంగాల సెక్రటరీ అని మాయమాటలతో మోసం చేసి వివిధ గ్రామాలకు చెందిన 52 మంది వద్ద నుంచి సుమారు రూ.రెండు కోట్ల మేర చిట్టీల పేరుతో దగా చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్లో శుక్రవారం బాధితులు ఫిర్యాదు చేశారు. మాయమాటలు చెప్పి చిట్టీల పేరుతో సమీప గ్రామాల్లోని పేదలను మోసం చేసి ఐపీ నోటీసులు దాఖలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని నూజివీడు పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీవాసులు పోలీసులను కోరారు.


ఆరోగ్య కేంద్రం పనితీరు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

పిహెచ్‌సిలో సర్దుబాటు చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల కోర్కెల సాధనకు చేపట్టిన నిరసన కార్యక్రమం ఉధృతం అవుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు వైద్యసేవలు ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పిజె.అమృతం సర్దుబాటు చర్యలను చేపట్టారు. దీనిలో భాగంగా పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన సహాయ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలక్ష్మిని వైద్య సేవలందించేందుకు పంపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శుక్రవారం సందర్శించారు. ఔట్ పేషెంట్ విభాగాన్ని పరిశీలించారు. అక్కడ రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి లక్ష్మణరావు ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 60 నుంచి వంద మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నట్లు తెలిపారు. దీనిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య తగ్గిన మేరకు తగ్గిందని, ప్రస్తుతం వైద్య సేవలందించేందుకు ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన సహాయ ప్రొఫెసర్‌ను నియమించిన నేపథ్యంలో వైద్య సేవలు ఇబ్బంది లేకుండా కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్లకు అండగా కూటమి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆదాయం తగ్గిన ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారిని ఆదుకునేందుకు తీసుకువచ్చిందే ఆటో డ్రైవర్ల సేవలో పథకం అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది దసరా సమయమని, కొన్నిరోజుల్లో దీపావళి పండుగ రానుందని, ఈ పండుగల సమయంలో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల్లో సంతోషం నింపేందుకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించే కార్యక్రమానికి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేరుతో అంతకు ముందు ఆటో డ్రైవర్ సేవలో పథకం ప్రారంభించిందని తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వం వాహన మిత్ర పథకం పేరుతో ఆటో డ్రైవర్లకు రూ.పది వేలు ఇచ్చేది, అదే సమయంలో జరిమానాల పేరుతో అంతకు రెట్టింపు ఆటో డ్రైవర్ల నుంచి వసూలు చేసేదని చెప్పారు. కాని ఇప్పుడు అలాంటి వేధింపులు ఏమి లేవని పేర్కొన్నారు. ఒక రోజు ఆటో నడపకపోయినా ఆ రోజు ఇంట్లో పూట గడవని పరిస్థితుల్లో నిరంతరం కష్టపడుతూ జీవించే వృత్తి ఆటో డ్రైవింగ్ అని, ఆటో డ్రైవర్లలో 90 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలవారే ఉంటున్నారని, వీరికి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అందించే రూ.15 వేల ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఇప్పటికిట్టుగానే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు సాయం అందిస్తున్నారని, ఇందులో ఏలూరు జిల్లా నుంచి 10,655 మంది లబ్ధి పొందుతున్నారని, వీరిలో 9,193 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాల వారే ఉన్నారని తెలిపారు.

రైతులు రీసర్వేను వినియోగించుకోవాలి

తహశీల్దార్ టి.సాయిబాబా

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులు రీ సర్వేను వినియోగించుకోవాలని తహశీల్దార్ టివిఎస్.సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మూడో ఫేజ్‌లో మండలంలోని బొర్రంపాలెం, తెడ్లం, శ్రీరామవరం గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల మూడో తేదీ నుంచి రీ సర్వే ఫీల్డ్ వర్క్, గ్రౌండ్ ట్రూతింగ్ వర్క్ మొదలవుతున్నట్లు గ్రామాల్లో టాంటాం, గ్రామసభలు నిర్వహించడం ద్వారా రైతులకు తెలియజేసినట్లు తెలిపారు. తెడ్లం, బొర్రంపాలెం, శ్రీరామవరం గ్రామాల్లో భూములు కలిగి ఉన్న రైతులందరికీ సర్వే నిర్వహించే ముందు నోటీస్, వాట్సాప్, మెసేజ్, ఫోన్ కాల్ ద్వారా తెలియజేసినట్లు ఆధార్ కార్డు జిరాక్స్, పాసుపోర్టు సైజ్ కలర్‌ఫోటో, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, దస్తావేజులు జిరాక్స్‌తో భూమి పైకి హాజరై సర్వే చేయించుకోవాలని తెలిపారు.


బాలుడిని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

బాలుడికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన గెడ్డం నిహాన్ (4) అనే బాలుడు ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్క దాడి చేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ బాలరాజు పిహెచ్‌సికి వెళ్లి బాలుడిని పరామర్శించారు. బాలుడి పరిస్థితి గురించి సిబ్బందిని ఆరా తీశారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు మండలాధ్యక్షులు రాము, నాయకులు రవికుమార్, చిర్రి వెంకటేశ్వరావు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

జంగారెడ్డిగూడెంలో ఘటన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతుని భార్య పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కర్రి రాజేష్ తన భార్య నాగేశ్వరితో కలిసి ఉప్పల మెట్ట కాలనీలో అద్దెకు ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో కొంతమంది దుండగులు కత్తులతో రాజేష్ ఇంటికి వెళ్లారు. వారిని గమనించిన రాజేష్ గోడ దూకి పారిపోయాడు. కొంతసేపటికి తన భర్త మృతి చెందినట్లు రాజేశ్వరికి సమాచారం అందింది. బైరెడు వంతెన కింద రాజేష్ మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజేష్‌ను కాళ్లు, చేతులు కట్టేసి కత్తులతో అతి క్రూరంగా చంపినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత విభేదాలు, పాత కక్షలే హత్యకు కారణమై ఉంటాయని ప్రాథమికంగా భావిస్తున్నారు. రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు రాజేష్ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

ముదినేపల్లి : వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ముదినేపల్లి శివారు కొత్త విమల(65) అనే వృద్ధురాలి భర్త వీరంకి సాంబయ్య రెండు నెలల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి విమల భర్తను తలచుకుంటూ మానసికంగా ఇబ్బంది పడుతుంది. కొన్నిరోజులుగా ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోతుండటంతో కుటుంబ సభ్యులు వెతికి తీసుకొస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వృద్ధురాలు వెళ్ళిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతుకుతూ ఉండగా సుమారు ఉదయం 5:30 గంటల సమయంలో పోల్‌రాజ్ కాలువలో బట్టలు ఉతుకుతున్న మహిళ ఒక ఆమె కాలువలో దిగి స్నానం చేస్తూ మునిగిపోతూ ఉండగా వారు వచ్చే సమయానికి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు చెప్పారు. వృద్ధురాలి కుమార్తె పరసా గాయత్రి తన తల్లి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రామ పంచాయతీల సమగ్ర సాధికారతకు కృషి

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

సుస్థిర అభివృద్ధితో గ్రామపంచాయతీల సమగ్ర సాధికారతకు కృషి చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో శుక్రవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ముదినేపల్లి, మండవల్లి మండలాలకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ఎంపిడిఒ రామకృష్ణ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గ్రామ పంచాయతీలోని అభివృద్ధి ప్రణాళికతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పాత్రను వివరించారు. ప్రజలకు మౌలిక అవసరాలు, గ్రామాల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు సామాజిక దురాచారాలు తదితర వాటిపై వివరించారు. గ్రామాల్లో విద్య వైద్యానికి మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు సహకారం అందించాలన్నారు. సుస్థిర అభివృద్ధి అంటే భవిష్యత్ తరాల అవసరాలకు భంగం కలగకుండా వర్తమాన అవసరాలను తీర్చడం, ఇది గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని రూపుమాపడం, మెరుగైన జీవన పరిస్థితులను సృష్టించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనికి సంబంధించి, గ్రామ పంచాయతీలు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడం, ఉన్నత విద్యా సంస్థల భాగస్వామ్యంతో సాంకేతికతను అందించడం వంటివి ముఖ్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణారావు, అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి సత్యనారాయణ

జీలుగుమిల్లికి రెండు అవార్డులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ పారిశుధ్య విభాగంలో జీలుగుమిల్లి మండలానికి రెండు అవార్డులు వచ్చినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి అవార్డుల్లో ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా పి.అంకంపాలెం గ్రామానికి చెందిన ఎన్.సూరమ్మ, అదే విధంగా స్వచ్ఛ గ్రామ పంచాయతీగా కామయ్యపాలెం ఎంపికైనట్లు ఎంపిడిఒ తెలిపారు. వీరిని ఈ నెల ఆరో తేదీన ముఖ్యమంత్రి జిల్లాస్థాయిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చేతులమీదుగా అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సునీల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు

రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వైసిపి ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఏలూరులో ఘనంగా నిర్వహించారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుడ్ సమ్మరిటన్ కేన్సర్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేష్ యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్ వంగు విక్రం, డాక్టర్ రమ్య, ప్రసాద్, పట్నాల ఉమ మణికంఠ, ప్రభు, శ్రీనివాస్, రాంపిల్ల యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో...

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో వైసిపి యూత్ ఐకాన్ కారుమూరి సునీల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే వ్యక్తి సునీల్‌కుమార్ అని చెప్పారు. అనంతరం కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ నాయకులు రేగుల గోపాలకృష్ణ, వైసిపి గ్రామ అధ్యక్షుడు తులిమెల్లి సుబ్బారావు, వైసిపి యూత్ నాయకుడు మానికల గంగాధరరావు, వైసిపి యూత్ ప్రెసిడెంట్ జి.రంగారావు, కొప్పుల ఏసుబాబు, రెడ్డి తిరుపతిరావు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో ఆఫ్రికన్ నత్తలను నివారించాలి

ఉద్యానవన శాఖాధికారి


ప్రజాశక్తి - చింతలపూడి

ఆఫ్రికన్ నత్తలు ఉద్యాన పంటల్లో ముఖ్యంగా బొప్పాయి, అరటి, జామ, కూరగాయలు, వక్క, కోకో, పామాయిల్ తోటలకు నష్టం కలగజేస్తున్నాయని చింతలపూడి ఉద్యానవన శాఖాధికారి ఎమ్‌డి.షఫీయా ఫార్హన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆఫ్రికన్ నత్తలు నెలకు వంద నుంచి 400 గుడ్డులు పెడతాయని తెలిపారు. దీనికి నివారణ తోటలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని, రైతులు చేతికి గ్లౌజులు వేసుకుని కనిపించిన నత్తలను ఎప్పటికప్పుడు ఏరి ఉప్పు నీటి ద్రావణంలో కలపాలని పేర్కొన్నారు.

వికలాంగులకు బియ్యం, పండ్లు అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

వికలాంగులను ఆదుకునేందుకు ఇప్పటివరకు మండలంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చేవి. తాజాగా ఈ జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు చేరుతున్నారు. ఈ క్రమంలో భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ తన పుట్టినరోజును పురస్కరించుకుని గుండుగొలనులో గురువారం వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి ప్రతినెలా 60 మంది వికలాంగులకు దాతల సహకారంతో బియ్యం, పండ్లు, నిత్యావసరాలు, ఇతరాలు అందిస్తున్నారన్నారు. ఈ క్రమంలో అక్టోబర్ నెలలో భీమడోలు ఎస్ఐ సుధాకర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అందించిన ఆర్థిక సహాయంతో 60 మంది వికలాంగులకు బియ్యం, నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. భీమడోలు ఎస్ఐ వితరణను పలువురు కొనియాడారు.


వికలాంగులకు అందిస్తున్న బియ్యం, పండ్లు

నూతన ఉపాధ్యాయులకు సత్కారం


నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రపంచాన్ని మార్చే దీపధారులు ఉపాధ్యాయులని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన లావుడియా సాయిప్రకాష్, భూక్యా ఆంజనేయులు, తేజావతు మౌనికలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజు నాయక్ మాట్లాడుతూ తరగతి నాలుగు గోడల మధ్య విద్యార్థులకు జ్ఞాన బోధ చేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే దీపధారులు ఉపాధ్యాయులు అని అన్నారు. అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందన్నారు. క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈ కార్యక్రమంలో జరభల ప్రసాద్, భూక్యా నాగమణి, భూక్యా వేణు గోపాల్, జరభల చందానాయక్, భూక్యా భిగనాదం, సర్వేశ్వరరావు, ధృత్విక్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు


ముసునూరులో...

ప్రజాశక్తి - ముసునూరు

గాంధీ ఆశయాలకు అనుగుణంగా సంసిద్ధంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందని సర్పంచి కొండేటి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసచౌదరి, పంచాయతీ స్వచ్ఛత పరిశుభ్రత కార్మికులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, ఉప సర్పంచి తోట శ్రీను, స్కూల్ కమిటీ మాజీ ఛైర్మన్ నక్క యోహాను, ముసునూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి : సత్యాగ్రహం ఆయుధంగా అహింస మార్గంలో పోరాడి భారతీయులకు స్వేచ్ఛా స్వాతంత్రం అందించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయ ఇఒ ప్రియస్వామి, ఐక్యవేదిక పరిరక్షణ సభ్యులు దీప్తి అప్పారావు స్పష్టం చేశారు. స్థానిక గాంధీ ఆశ్రమంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశంలో అక్టోబర్ రెండో తేదీన జాతీయ సెలవుదినంగా ప్రకటించడంతోపాటు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అహింస దినోత్సవం కూడా పాటించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముల్లపూడి సత్తిబాబు, చాబత్తిన విజయ్, గుడివాడ గణేష్, వీరమల్లు శివయ్య, నల్లా వెంకటేశ్వరరావు, వరద శ్యామ్ గణేష్, అద్దేపల్లి సత్యనారాయణ, మెండ సురేష్ పాల్గొన్నారు.

పోలవరం : గాంధీజీ చూపించిన అహింస మార్గం సత్య నిబద్ధత ఈనాటి సమాజానికి మార్గదర్శకాలని స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం చేగొండపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి జారం సీతారామలక్ష్మి, రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


పోలవరంలో...

కూటమి నాయకుల ఆధ్వర్యాన ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో వ్యవసాయ శాఖ, కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ వారోత్సవాల్లో భాగంగా ట్రాక్టర్ల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో టిడిపి మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఇంటి నుంచి పాత కుక్కునూరు గ్రామ సచివాలయం, రామాలయం మీదుగా మండల కేంద్రానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ భాషా స్వయంగా ట్రాక్టర్ నడిపి ర్యాలీకి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, కెఆర్.పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు, కుక్కునూరు మండల వ్యవసాయాధికారి ఆర్.బాలాజీ, తహశీల్దార్ పి.రమేష్, ఎంపిడిఒ పి.నరసింహారావు,

కలిదిండి : జిఎస్‌టి తగ్గుదల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ టిడిపి నాయకులు ప్రధాన సెంటర్‌లో ప్రచారం నిర్వహించారు. కిరాణా, దుస్తులు, పాదరక్షలు, మం దులు, స్టేషనరీ తదితర వస్తువులపై తగ్గిన జి ఎస్ టి ని ప్రజలకు వివరించారు. టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీ రమల్లు నర సింహారావు, టి డిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొ ంషన్ డైరెక్టర్ అంద్రా జు శ్రీనివా సరావు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నా రావు, పట్టణ టిడిపి అధ్యక్షు లు అబ్దుల్ అక్బర్ల పాల్గొన్నారు.



కలిదిండిలో...

ముసునూరు : జిఎస్‌టి తగ్గింపుతో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లపై 22 శాతం నుంచి ఐదు శాతం వరకు తగ్గించినట్లు టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామం నుంచి పలు గ్రామాల వరకు మండల వ్యవసాయ అధికారి ఆలూరు చాముండేశ్వరి, టిడిపి నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాక్టర్లతో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారం, దేవినేని శ్రీధర్, టి.రంగారావు, పులిబళ్ల లక్ష్మీ సత్యనారాయణ, రాపర్ల బాలకృష్ణ, గద్దల మోహన్‌రావు, గరికముక్కు నాని, కొండేపు రామగిరిరావు, కాటేపల్లి ప్రసాద్, మెదరమెట్ల సురేంద్ర, సూర్యదేవర శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా కూటమి'

చింతలపూడి : కూటమి ప్రభుత్వం కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని చింతలపూడి ఎఎంసి ఛైర్‌పర్సన్ చీదరాల దుర్గాపార్వతి మధుబాబు అన్నారు. ఆమెను టిడిపి ప్రగడవరం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అట్లతద్దెకు, గొంతెనమ్మ జాతరకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె జాతరకు రూ.ఐదు వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు

ప్రజాశక్తి - మండవల్లి

దసరాను యాత్రికులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మండవల్లి, ఇంగిలంపాకలంక, పెరికేగూడెం, చింతపండు, కొవ్వాడలంక, లింగాల, కానుకొల్లు గ్రామాల్లోని ఆలయాలు గురువారం యాత్రికులతో కిటకిటలాడాయి. స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు సిబ్బందితో మేళతాళాలతో ఊరేగింపుగా శివాలయానికి చేరుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల పూజల్లో ఎస్ఐ రామచంద్రరావు దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.


దసర వేడుకల్లో ఎస్ఐ దంపతులు